క్లుప్తంగా

భూసేకరణకు సర్వే

డోర్నకల్: డోర్నకల్ పట్టణ సమీపంలోని బుద్దారం రోడ్డు నుంచి సమ్మర్ స్టోరేజీ వరకు నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి భూసేకరణ కోసం మంగళవారం మహబూబాబాద్ ఆర్డీఓ కృష్ణవేణి సర్వే నిర్వహించారు. 1.7కిలోమీటర్ల బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం రూ.6కోట్ల నిధులు మంజూరు కాగా 2023 అక్టోబర్ 2న అప్పటి ఎమ్మెల్యే రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. రోడ్డు కోసం 8ఎకరాల భూమిని ససేకరించాల్సి ఉంది. కార్యక్రమంలో తహసీల్దారు కృష్ణవేణి, సర్వేయర్ వెంకన్న పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల రద్దుపై ఫిర్యాదు

తొర్రూరు రూరల్: మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన నిరుపేదలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్లను అకారణంగా రద్దు చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు పూసాల శ్రీమాన్, పల్లె కుమార్, సిరికొండ సంపత్, శివ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రూ.50వేల ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు హరియాతండాలో ఇటీవల గాలివాన బీభత్సానికి ఇళ్లు కూలిపోయిన ఐదు కుటుంబాలకు డోర్నకల్ విజయ ఫౌండేషన్ వ్యవస్థాపకు అధ్యక్షుడు మాలోత్ రామారావు మంగళవారం ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.50వేల ఆర్థికసాయాన్ని అందజేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో బానోత్ అచ్చి, భుక్య సూర్య, బానోత్ పార్వతి, మాలోత్ శ్రీధర్, జర్పుల హునిల ఇళ్లు కూలిపోయాయి.

గిరిజనులకు రెడ్‌క్రాస్ సొసైటీ సాయం



కురవి: గాలిదుమారంతో ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయి నీడలేక బాధపడుతున్న సీరోలు మండలం బీల్యానాయక్‌తండా గిరిజనులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మహబూబాబాద్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూ ఆధ్వర్యంలో మంగళవారం టార్పాలిన్‌లు, చద్దర్లు, వంట సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో ట్రెజరర్ మాదవపెద్ది వెంకట్‌రెడ్డి, సభ్యుడు గొర్రె వెంకన్న, బోడ మంగ్యా, కేలోత్ సురేష్, దేవేందర్, అర్జున్‌చౌహాన్ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా కిషన్‌నాయక్



కురవి: బీజేపీ మండల అధ్యక్షుడిగా బలపాల శివారు లింగ్యాతండా గ్రామానికి చెందిన భూక్య కిషన్‌నాయక్‌ను మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిల్ సభ్యుడిగా మోద్గులగూడెం గ్రామానికి చెందిన కోడి రామకృష్ణను ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపాడు.

మాలమహానాడు పట్టణ సెక్రటరీగా జనార్దన్‌రావు



డోర్నకల్: మాలమహానాడు డోర్నకల్ పట్టణ సెక్రటరీగా నాయిని జనార్దన్‌రావును నియమించినట్లు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చిట్టిమల్ల మహేష్ మంగళవారం తెలిపారు.

అవగాహనతోనే టీబీ నియంత్రణ

మరిపెడ: అవగాహనతోనే టీబీ నియంత్రణ సాధ్యమవుతుందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గుగులోతు రవికుమార్ అన్నారు. పీహెచ్‌సీలో మంగళవారం టీబీ నిర్ధారణ కోసం తెమడ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మంగమ్మ, కృష్ణ, సుదర్శన్, ఆచార్యులు, లక్ష్మీకుమారి, మాధవి, పల్లెదవాఖానా సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్ర గాయాలను సంఘటన జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ ప్రాంతంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లికుదురు మండలంలోని ఆలేరు గ్రామానికి చెందిన ఈర్ల వెంకన్న ఆయన భార్య వెంకటలక్ష్మి బయ్యారం మండలంలోని గొల్లగూడెం గ్రామంలో గల తమ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వారు తమతోపాటు మనమరాలు హిమవర్షినిని వెంటపెట్టుకుని తమ ద్విచక్రవాహనంపై బయలుదేరారు. ద్విచక్రవాహనం జిల్లా కేంద్రంలోని బీసీ కాలనీ సమీపంలోకి చేరుకుంటున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న, హిమవర్షినికి స్వల్పగాయాలు కాగా వెంకటలక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు.

హెచ్చరిక బోర్డు ఎక్కడ?

- కాల్వ గుంతలో పడి ఒకరి మృతి
- ఏర్పాటు చేయని కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి
- ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసిన తర్వాతే పనులు చేపట్టాలని ప్రజల డిమాండ్



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకుండా రహదారికి అడ్డంగా కొనసాగుతున్న కాల్వ పనులు



సోమవారం రాత్రి కాల్వలో పడిన బైక్

గార్ల: గార్ల- డోర్నకల్ మధ్యలో ఆర్అండ్‌బీ రహదారిని తొలగించి సీతారామ ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణ పనులు చేపడుతూ, కాల్వ వద్ద ఎలాంటి హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయని కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణం చేపట్టే సమయంలో ప్రజలకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయకుండా కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా కాల్వ తవ్వకం చేపట్టారని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం నెమలిపురితండాకు చెందిన భార్యభర్తలు సపావత్ విజయ, భావ్‌సింగ్‌లు బైక్‌పై వస్తూ ఇదే రహదారి అనుకొని బైక్‌తో సహా 40మీటర్ల లోతులో ఇద్దరు కాల్వ గొయ్యిలో పడిపోగా, భార్య అక్కడిక్కడే మృతిచెందింది. భర్త ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాజెక్ట్ కాంట్రాక్టర్ రహదారిని తొలగించేటప్పుడు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఉన్నా కాంట్రాక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ కాల్వ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగిస్తున్నాడని పది రోజుల నుంచి ఈ ప్రాంత ప్రజలు కాంట్రాక్టర్‌కు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. దీంతో సుదూర ప్రాంతాల ప్రజలు ఇదే రహదారి అనుకొని రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసి, కాల్వ నిర్మాణం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన తర్వాతే కాల్వ నిర్మాణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలి



బీటీ రహదారిని తొలగించి ప్రాజెక్ట్ కాల్వ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ముందుగా ఈ ప్రాంత ప్రజలకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసిన తర్వాతే కాల్వ నిర్మాణ పనులు చేపట్టాలి. గత రాత్రి రహదారి గుండా వెళ్తూ ప్రమాదవశాత్తు కాల్వ గొయ్యిలో పడి మృతిచెందిన విజయ కుటుంబానికి కాంట్రాక్టర్ రూ.50 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

\- కందునూరి శ్రీనివాస్, గార్ల

లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలి



మహబూబాబాద్ రూరల్: సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాకార్యకర్తలు

మహబూబాబాద్ రూరల్/నెల్లికుదురు/కురవి/గార్ల/దంతాలపల్లి: కేంద్ర బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి కుమ్మరికుంట్ల నాగన్న, ఆశవర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు మాధ కర్ణ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 20వ తేదీన జరగనున్న సమ్మె సందర్భంగా మండలంలోని కంబాలపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ధర్మసోత్ సాగర్‌కు సమ్మె నోటీసు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సావిత్రి, సునీత, సరిత, లక్ష్మీ, సావిత్రి, సునీత, రమ్య, రమా, జ్యోతి, గీత పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా కార్యదర్శి సమ్మెట రాజమౌళి అన్నారు. ఈనెల 20న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మధు, ముస్తాఫా, వెంకన్న, సైదులాబ్, లింగయ్య, ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రణాళికతో నియోజకవర్గ అభివృద్ధి

- ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు: పక్కా ప్రణాళికతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిధుల కొరత ఉన్నప్పటికీ వాటిని అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, నాయకులు మంగళపల్లి రామచంద్రయ్య, జాటోతు హామ్యా నాయక్, సుంచు సంతోష్, సోమ రాజశేఖర్, గంజి విజయ్‌పాల్‌రెడ్డి, చాపల బాపురెడ్డి, సురేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే విఫలం



మాట్లాడుతున్న శ్రీనివాస్

తొర్రూరు: పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే విఫలమైందని మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి దయాకర్‌రావు మంజూరు చేయించిన పనులను తమవిగా చెప్పుకుంటూ ప్రారంభోత్సవాలు చేయడం హాస్యాస్పదమన్నారు. తొర్రూరులో మినీ ట్యాంకుబండ్, వంద పడకల ఆసుపత్రి మంజూరు చేయిస్తే ఆ పనులు కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో నాయకులు కల్వకొలను జనార్దన్‌రాజు, నలమాస ప్రమోద్, ఈనెపల్లి శ్రీనివాస్, ఎస్కే అంకూస్, మాలోతు కాలునాయక్, వెంకట్‌రెడ్డి, మాచర్ల వెంకన్న పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దవంగర: మండల కేంద్రంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో పది రోజులైన ధాన్యం కొనుగోలులో అలసత్వం వహిస్తున్నారని పేర్కొంటూ మంగళవారం నిరసన తెలిపారు. ముందుగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. తహసీల్దార్ మహేందర్‌కు సమస్యను తెలిపేందుకు వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో సీనియర్ అసిస్టెంట్ ఫోన్ ద్వారా సమస్యను వివరించారు. అనంతరం పలువురు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లి రెండు ధాన్యం బస్తాలకు నిప్పుపెట్టి నిరసన వ్యక్తం చేసినట్లు తెలిపారు. గన్నీ సంచులు లేక పోవడంతో ధాన్యం కాంటాలు ఆలస్యం అవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లారీలు రాకపోవడంతో కాంటపెట్టిన బస్తాలు రాత్రి వచ్చిన వర్షానికి తడిశాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో మీసేవ నిర్వాహకుడి ఆత్మహత్య



విద్యాసాగర్ (ఫైల్)

నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్ సెంటర్‌కు సమీపంలో మీసేవ నిర్వాహకుడు గండ్రాతి విద్యాసాగర్(29) ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై మాలోతు సురేష్ కథనం ప్రకారం.. సీరోలు మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన విద్యాసాగర్ ఐదేళ్ల క్రితం నర్సింహులపేటలో మీ సేవను నడిపిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మీసేవ సక్రమంగా నడవకపోవడం, కుటుంబపోషణ కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతూ మన స్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన చుట్టుపక్కల వారు ఆసుపత్రికి తరలించగానే అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి రెండేళ్లు, 21రోజుల ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తల్లి శోభ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వక్ఫ్ చట్టంతో పేద ముస్లింలకు న్యాయం



మాట్లాడుతున్న రామచంద్రరావు

దంతాలపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లుతో పేద ముస్లింలకు న్యాయం జరుగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వద్దిరాజు రామచంద్రరావు అన్నారు. మండల కేంద్రంలో పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. విద్యా, ఆర్థికరంగాలలో వెనుకబడిన నిరుపేద ముస్లింలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రధాని మోదీ బిల్లు ప్రవేశ పెడితే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు చీకటి మహేష్, పూర్ణచందర్‌రెడ్డి, సారెడ్డి రాణిరెడ్డి, గుండగాని భరత్, దాసరి మురళీ, ఉప్పలయ్య పాల్గొన్నారు.

రిజర్వేషన్ల పితామహుడు 'సాహు'



మహబూబాబాద్ అర్బన్: సాహు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: రిజర్వేషన్ల పితామహుడు సాహు మహారాజ్ అని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి ప్రభాకర్ అన్నారు. జిల్లా కేంద్రం అంబేద్కర్ సెంటర్‌లో సాహు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధరావత్ బద్రు నాయక్, నాయకులు యాకోబు నాయక్ , నిలయ్య, దుడ్డెల రామ్మూర్తి, భూక్య హరినాయక్, తప్పెట్ల వీరన్న, సామ్యూల్ , తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: సాహు మహారాజ్ భవిష్యత్ భారతానికి సామాజిక న్యాయవాది అని సామాజిక అధ్యయన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పార్నంది రామయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్పీస్ కార్యాలయంలో మంగళవారం సాహు మహారాజ్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు మోకాళ్ల వెంకన్న, చుంచ బాలయ్య, సుధాకర్, సంపత్, బోడ ఎల్లయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలి



గూడూరు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విద్యుత్ అధికారులు

గూడూరు: ప్రతీ ఒక్కరు విద్యుత్ భద్రతా ప్రమాణాలు పాటించాలని డివిజనల్ ఇంజనీర్ పెద్దిరాజం, మహబూబాబాద్ డివిజనల్ ఇంజనీర్ పి.విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం విద్యుత్ భద్రతా వారోత్సవాలపై గూడూరు సబ్ డివిజన్ విద్యుత్ సిబ్బందితో ఏడీఈ కె.కవిత ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ భద్రతపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. అదేవిధంగా ప్రజలకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేస్తూ, భద్రత, పొదుపు సూత్రాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఈ ప్రణీత్, సబ్ ఇంజనీర్ లక్ష్మణ్, మెట్టురాం, సిబ్బంది పాల్గొన్నారు.

కేసముద్రం: విద్యుత్ ప్రమాదాల నుంచి రక్షించుకునేందుకు ప్రతీ ఒక్కరు భద్రత సూచనలు పాటించాలని విద్యుత్ డీఈ పెద్దిరాజం అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలో విద్యుత్ భద్రతపై వినియోగదారులకు, సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ ఆపరేష్ విజయ్, ఏడీఈ కేసముద్రం ప్రశాంత్, కేసముద్రం ఏఈ రాజు, సబ్ ఇంజనీర్ కరుణాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

కురవి: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని కేవీకే సమన్వయకర్త మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఉద్యానవన పట్టు పరిశ్రమ అధికారి మరియన్న అన్నారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని కురవిలోని రైతు వేదిక భవనంలో నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. పంటల మార్పిడిని పెంచి పర్యావరణ పరిరక్షణకు చెట్లను పెంచాలన్నారు. పప్పుదినుసు పంటలు, పచ్చిరొట్ట ఎరువులు వేస్తూ.. యూరియా వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించాలన్నారు. డాక్టర్ క్రాంతికుమార్, విస్తరణ శాస్త్రవేత్త కిషోర్‌కుమార్, ఆత్మ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి, ఎంఏఓ నరసింహారావు, అధికారులు రాజేశ్వరి, విజేందర్, దేవా, రమ్య, లయ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలను ఎంఈఓలు, హెచ్ఎంలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజులు నిర్వహించే శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, మ్యాథ్స్, నైతిక విలువలు ఇలా అనేక అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ అర్బన్: కంకరబోర్డ్ పాఠశాలలో..



మరిపెడ: మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లిలో..



గూడూరు: అయోధ్యపురం జెడ్పీహెచ్ఎస్‌లో క్యారం ఆడుతున్న ట్రైనీ ఎస్సై



కురవి: క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు



దోర్నకల్: మన్నెగూడెంలో..



నెల్లికుదురు ఆలేరు హైస్కూల్‌లో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ



పెద్దవంగర: విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ఎంఈఓ శ్రీనివాస్

సంక్షిప్త సమాచారం

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బయ్యారం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి జిల్లా ఇల్లెందు మండలం ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన తాటి ముత్తయ్య (48) ఈనెల 3న ఆటోలో మహబూబాబాద్ వైపు వెళ్తుండగా ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదే రోజు చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు ఎస్సై తిరుపతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్‌పామ్ తోట దగ్ధం

కురవి: సీరోలు మండలం తాళ్లసంకీస గ్రామానికి చెందిన ప్రతాపని పుల్లయ్య అనే రైతుకు చెందిన ఆయిల్‌పామ్ తోట మంగళవారం అగ్నికి ఆహుతి అయింది. అయితే పక్కనే రైతు పొలంలో ఉన్న తాటిచెట్టుకు నిప్పు పెట్టాడు. దీంతో మంటలు వ్యాపించి ఆయిల్‌పాం తోటలో 20 చెట్లు దగ్ధమయ్యాయి.

సీఎం వ్యాఖ్యలు విచారకరం

మరిపెడ: ప్రజల్లో ఉద్యోగులను పలుచన చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడడం విచారకరమని పీఆర్టీయూ అసోసియేట్ రాష్ట్ర అధ్యక్షుడు కుడితి ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పీఆర్టీయూ ఆధ్వర్యంలో మరిపెడలో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కీసర రమేష్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లింగాల మహేష్‌గౌడ్, వెరమరెడ్డి నర్సిరెడ్డి, దోమల లింగన్న, గండి కరుణాకర్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి

కురవి: జర్నలిస్టులందరికీ ఇంటి స్థలంతోపాటు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీనియర్ జర్నలిస్ట్ బేతమళ్ల సహదేవ్ ప్రభుత్వాన్ని కోరాడు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు.

సీఎస్‌ను కలిసిన ఏలేందర్

మహబూబాబాద్: హైదరాబాద్‌లో రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణా రావును మంగళవారం మానుకోటకు చెందిన ఎలేందర్ మర్యాద పూర్వకంగా కలిశారు. మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలపై సీఎస్‌కు వివరించినట్లు తెలిపారు.

బొడ్రాయి వార్షికోత్సవం



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలంలోని లక్ష్మిపురం తండా గ్రామంలో బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలను మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, డీజే పాటల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

లారీల్లో ధాన్యం లోడ్ చేయించిన తహసీల్దార్

బయ్యారం: వర్షం వచ్చే సూచనలు ఉండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రంలో కాంటాలు అయిన ధాన్యం బస్తాలను తహసీల్దార్ బి.విజయ మంగళవారం దగ్గరుండి లారీల్లో లోడ్ చేయించారు. కొన్ని రోజుల క్రితం బయ్యారంలోని సొసైటీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా పెట్టి బస్తాల్లో నిల్వ ఉంచారు. ఈక్రమంలో వాతావరణ శాఖ వర్షసూచన ఇవ్వడంతో తహసీల్దార్ స్వయంగా కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చి నిర్వాహకులతో మాట్లాడి లారీలతోపాటు హమాలీలను రప్పించి బస్తాలను దగ్గరుండి లోడ్ చేయించారు.

గంట బహూకరణ

మహబూబాబాద్ రూరల్: మానుకోట మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామ పరిధిలోని బోరింగ్ తండా, రాంసింగ్ తండా, అమీర్యా తండా, బగ్గుతండా గిరిజనులు నూతనంగా నిర్మిస్తున్న పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయానికి గంటని మంగళవారం బహూకరించారు. తమ తాత దారా పాపారావు జ్ఞాపకార్థం గంట బహూకరించామని మనుమరాలు దారా ఇందు భారతి తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

చిన్నగూడూరు: మండలంలోని ఉగ్గంపల్లి గ్రామ శివారు దుమ్మాతండాలో ఓ రైతు పశుగ్రాసం దగ్ధమైన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు గుగులోత్ నాగు తెలిపిన వివరాల ప్రకారం.. యాసంగి పంటకు చెందిన గ్రాసం తన పశువుల కోసం ఇంటి దగ్గర పేర్చినట్లు తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు నిప్పు అంటుకున్నట్లు తెలిపారు. మంటల్లో దగ్ధమైన గడ్డి 150మోపులు ఉంటుందని, దాని విలువ సుమారు రూ.15వేలు ఉంటుందని తెలిపాడు.

తల్లికి తలకొరివి పెట్టిన కూతురు

కురవి: మండలంలోని మోద్గులగూడెం గ్రామానికి చెందిన గందు ఉపేంద్ర(55) సోమవారం రాత్రి 11 గంటలకు అనారోగ్యంతో మృతి చెందింది. గత 15 సంవత్సరాల క్రితమే మృతురాలి భర్త చనిపోయాడు. అయితే మృతురాలికి కుమారులు లేకపోవడంతో, తన ఏకైక కూతురు అదే గ్రామానికి చెందిన రడం దివ్య మంగళవారం తన తల్లికి కన్నీటితో వీడ్కోలు పలుకుతూ, తలకొరివి పెట్టి అంత్యక్రియలు నిర్వహించింది.